## పాయల్‌కు నాలుగు పతకాలు




**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** అదిత్య మెహతా ఫౌండేషన్‌లో శిక్షణ పొందిన హర్యానా పారా పవర్ లిఫ్టర్ పాయల్ అంతర్జాతీయ వేదికపై రాణించారు. బ్యాంకాక్‌లో జరిగిన ఆసియా ఓషియానియా ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణ పతకాలు, రెండు రజత పతకాలు సాధించారు. ఆమె ప్రతిభను గుర్తించిన అదిత్య మెహతా ఫౌండేషన్ అవసరమైన శిక్షణ, మద్దతు అందించింది. వ్యక్తిగత విభాగంలో రెండు స్వర్ణాలు, టోటల్ లిఫ్ట్ విభాగంలో రెండు రజత పతకాలు గెలుచుకున్నారు.

## ఓయూ పాలక మండలి సభ్యురాలుగా ప్రొఫెసర్ నీరజ



**ప్రజాపక్షం/బహదూర్‌పురా:** చారిత్రక ఉస్మానియా విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యురాలుగా సిటీ కళాశాల ఐక్యూయేసి కోఆర్డినేటర్ ప్రొఫెసర్ జె.నీరజ ఎంపికయ్యారు. నీరజ సిటీ కళాశాల తెలుగు శాఖ ఆచార్యులుగా సేవలందిస్తున్నారు. సిటీ కళాశాలకు దేశంలోనే అత్యున్నతంగా ఏ ప్లస్‌ప్లస్ గ్రేడ్ సాధించటంలో ప్రొఫెసర్ నీరజ కీలక పాత్ర పోషించారు. కళాశాల విద్యాశాఖలో అకడమిక్ ఆఫీసర్‌గా కూడా ప్రొఫెసర్ నీరజ విశేషమైన సేవలందించి ఉన్నతాధికారుల, అధ్యాపకుల ప్రశంసలందుకున్నారు. విశేషమైన బోధనానుభవంతో పాటు సమర్థవంతమైన పాలనానుభవం ఉన్న ప్రొఫెసర్ నీరజ పాలక మండలిసభ్యురాలుగా ఎంపిక కావటం పట్ల సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రసాద్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

## అలైవ్-అరైవ్ స్పెషల్ డ్రైవ్



**ప్రజాపక్షం/అబిడ్స్:** ప్రతి ఆటోడ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు రహదారి భద్రతను మెరుగుపరచడానికి గురువారం అబిడ్స్ ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో ఆటో రిక్షాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలతో పాటు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆటో డ్రైవర్లు కచ్చితంగా ఖాకి యూనిఫామ్ ధరించాలని, ఆటోలో అనుమతికి మించి ప్రయాణికులకు ఎక్కించుకోవద్దని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఆటో స్టాండ్లు, సురక్షితమైన ప్రదేశాలలో మాత్రమే ప్రయాణికులను ఎక్కించడం లేదా దింపడం చేయాలని, మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనం సీజ్ చేయడంతో పాటు లైసెన్స్ రద్దు చేయబడుతని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు పాండురాజు, మహేష్, సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ సేవలు పునరుద్ధరణ

**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** కస్టమర్ కేర్ నెం: 155313.. ఐవిఆర్ఎస్ ప్రస్తుతం యథావిధిగా పనిచేస్తున్నట్లు జలమండలి తెలిపింది. సాంకేతిక లోపం కారణంగా తాత్కాలికంగా పనిచేయలేదని.. ఈ సమస్యను బిఎస్ఎన్ఎల్ సాంకేతిక బృందం అత్యవసరంగా పరిష్కరించడం జరిగిందని జలమండలి అధికారులు తెలిపారు. వినియోగదారులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నట్లు జలమండలి స్పష్టం చేసింది. వినియోగదారులు తిరిగి కస్టమర్ కేర్ నెం:155313 ద్వారా తమ ఫిర్యాదులు, సేవలు, సమాచారం పొందవచ్చు. వినియోగదారులు తమ అవసరాలకు అనుగుణంగా నీటి ట్యాంకర్ బుకింగ్ కోసం ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవచ్చు.

## నేడు జాబ్ మేళా

**ప్రజాపక్షం / సిటీ బ్యూరో :** మల్లేపల్లి ఐటిఐ క్యాంపస్ వద్ద గల ఉపాధికల్పనాధికారి కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎ.వందన ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం వంద ఉద్యోగాలకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. 18 నుంచి 40 సంవత్సరాల వయసు గల నిరుద్యోగులు ఈ ఉద్యోగాలకు అర్హులని ఆమె చెప్పారు. జుంబోతాలి టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో డెలివరీ బాయ్స్, పికర్స్ అండ్ ప్యాకర్ ఉద్యోగాలు 50 ఉన్నాయన్నారు. వీటికి పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. నెలవారీ వేతనం రూ. 18వేల నుంచి రూ. 20వేలు ఉంటుందని చెప్పారు. జిఎంఆర్ హాస్పటల్ లిమిటెడ్‌లో గెస్ట్ సర్వీస్ అసోసియేట్, హౌజ్ కీపింగ్ స్టాఫ్, లోడర్స్, కులినరి పోస్టులు 50 ఉన్నాయన్నారు. వీటికి 10వ తరగతి నుంచి డిగ్రి వరకు విద్యార్హత ఉండాలని, నెల వారి వేతనం రూ.15వేల నుంచి రూ.16వేల వరకు ఉంటుందని ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ధృవీకరణ పత్రాలతో హాజరుకావాలని ఆమె తెలిపారు.

## బిసి ఫెడరేషన్లు, కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించాలి

టిజెఎస్ బిసి విభాగం కన్వీనర్ జశ్వంత్ డిమాండ్




**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:** రాష్ట్రంలో బిసిల ఫెడరేషన్లు, కార్పొరేషన్లకు చైర్మన్ల పదవులను భర్తీ చేయాలని తెలంగాణ జనసమితి (టిజెఎస్) పార్టీ బిసి విభాగం కన్వీనర్ అంబర్‌పేట్ జశ్వంత్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బిసి ఫెడరేషన్ కులాల సమితి అధ్యక్షులు బెల్లాపు దుర్గారావు, ప్రధానకార్యదర్శి కీర్తి యుగంధర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి జశ్వంత్ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. బిసి కులాల సమగ్రాభివృద్ధికి ఫెడరేషన్లు, కార్పొరేషన్ల ఏర్పాటు అవసరమన్నారు. బిసి నిరుద్యోగ యువతకు ఉపాధి నిమిత్తం రాయితీ రుణాలను కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బిసి కులాల్లో అత్యంత వెనుకబడ్డ నాయీ బ్రాహ్మణ, విశ్వ బ్రాహ్మణ, మేదరి, కుమ్మరి, బోయ, పూసల, సగర, వడ్డెర, బట్రాజు, మేరు, గంగపుత్ర కులాలకు కార్పొరేషన్లకు ఏర్పాటు చేసి, బడ్జెట్ కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని జశ్వంత్ డిమాండ్ చేశారు. సమావేశంలో సమితి నేతలు సారోళ్ల సోమ , వంశ క్షత్రియ ప్రవీణ్, జాజే రావు, వేదకార్, మహిళా కమిటీ అధ్యక్షురాలు బైరాగి అరుణ, ప్రధానకార్యదర్శి పిల్లి స్వప్న, కోశాధికారి బి.నవనీత తదితర నేతలు పాల్గొన్నారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలి

• సీతాఫల్‌మండి స్కూల్‌కు కేటాయించిన రూ.30 కోట్ల విడుదల చేయాలి • రౌండ్ సమావేశంలో డిమాండ్



**ప్రజాపక్షం/సికింద్రాబాద్:** విజయ డెయిరీ ప్రభుత్వ పాఠశాల 5 ఎకరాల స్థలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని, నిధుల కొరతతో పునాదిలోనే ఆగిపోయిన సీతాఫల్‌మండి విద్యాసంస్థల భవన నిర్మాణానికి కేటాయించిన రూ. 30 కోట్ల నిధులను తక్షణమే ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని నాయకులు డిమాండ్ చేశారు. సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, విద్యా కమిషన్ సలహాదారులు, ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ... హైదరాబాద్ మహానగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వైన్స్ షాప్‌లు ఏర్పాటు చేస్తున్నారు కానీ.. పేద వర్గాలకు నాణ్యమైన విద్యను అందించేందుకు సరైన పాఠశాలలు లేకపోవడం అత్యంత బాధాకరమని అన్నారు. 49 ఎకరాల విశాలమైన స్థలం ఉన్న తార్నాక విజయ డెయిరీ ప్రాంతంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా నిధుల కొరతతో పునాదిలోని ఆగిపోయిన విద్యాసంస్థల భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి తమ సొంత నిధుల నుంచి స్కూలుకు కేటాయించిన రూ.30 కోట్లను తక్షణమే విడుదల చేసి యుద్ధ ప్రాతిపదికన వచ్చే విద్యా సంవత్సరానికి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. మహానగరంలో పాఠశాలలు తక్కువ ఉన్నాయని.. ఉన్న వాటికి సరియైన భవనాలు లేవని.. ఇట్లాంటి దుస్థితి సమాజానికి మంచిది కాదన్నారు. కార్యక్రమంలో...సీతాఫల్‌మండి మాజీ కార్పొరేటర్ హేమ, టిడిపి సికింద్రాబాద్ ఇంచార్జి వల్లారపు శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ వైస్ ప్రెసిడెంట్ బ్రహ్మాజీ,బిజెపి రాష్ట్ర నాయకులు రచ్చమల్ల కృష్ణమూర్తి, పిటిఎటిజి అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి, సిఆర్‌పిఎఫ్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పుట్ట లక్ష్మణ్, పిడిఎస్‌యు హైదరాబాద్ జిల్లా కార్యదర్శి రాకేష్, తల్లుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగ్య, డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, పవన్‌రాజ్, జయలక్ష్మి, సూరవెంకటయ్య, రామలీల, రమేష్, కృష్ణ, కొమురెల్లి బాబు, చైతన్య యాదవ్, అనిల్, ప్రవీణ్, శ్రీనివాస్, రెహమాన్, ఉదయ్, మాణిక్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## టిజిపిఓఎ చర్చలు సఫలం



**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ నాయకత్వంలో సంఘం ప్రతినిధులు గురువారం రాష్ట్ర ఉన్నతాధికారులను కలిశారు. ఫార్మసీ ఆఫీసర్లు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలపై వినతిపత్రాలు సమర్పించి, వారితో విస్తృతంగా చర్చించారు. చర్చలు అత్యంత సానుకూల వాతావరణంలో, విజయవంతంగా ముగిశాయని సంఘం నేతలు వెల్లడించారు. ఆరోగ్య శాఖ మంత్రి ప్రస్తుతం బిజీ షెడ్యూల్లో ఉన్నందున, వారం రోజుల తర్వాత ఫార్మసీ ఆఫీసర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై కూలంకషంగా చర్చిస్తామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీజీపీవోఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఏవి శ్రీహరి, కార్యదర్శి ఆనంద్ కుమార్, రాష్ట్ర నాయకులు కే. సత్యం, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ రావు, నిర్మల్ జిల్లా నాయకులు మోహన్‌రెడ్డి, సిద్ధిపేట నాయకులు ఏకె ఖాన్, కరీంనగర్ జిల్లా నాయకులు ఇక్బాల్ అహ్మద్, హైదరాబాద్ జిల్లా నాయకురాళ్లు రాధిక, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



అధికారులకు ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆదేశం

**ప్రజాపక్షం/మలక్‌పేట్:** విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మలక్‌పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులను ఆదేశించారు. ఆస్మాన్‌ఘడ్ విద్యుత్ శాఖ డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఇతర అధికారులతో కలిసి విద్యుత్ సమస్యలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు సలాం షాహిద్, మినాజ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ మారుతి క్యాబ్ అసోసియేషన్ ఆవిర్భావం

క్యాబ్ డ్రైవర్లకు అండగా ఉంటా:ఎమ్మెల్యే ముఠా గోపాల్




**ప్రజాపక్షం/ముషీరాబాద్:** క్యాబ్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ హామీ ఇచ్చారు. తెలంగాణ మారుతి క్యాబ్స్ అసోసియేషన్ ఆవిర్భావ సమావేశం గురువారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, ట్రాఫిక్ అదనపు డీసీపీ రాందాస్ తేజవత్, బిఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ హాజరయ్యారు. ఈ సందర్భంగాఅసోసియేషన్‌కి సంబంధించిన లోగోను వారు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ... ప్రతి ఒక్క డ్రైవరు కచ్చితంగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. తన దృష్టికి తీసుకువచ్చిన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జయేందర్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ మహేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి విద్యావత్ సంతోష్, సంయుక్త కార్యదర్శి బాలు నాయక్, జె. వెంకన్న, కోశాధికారి సబరావతి రాహుల్, సతీష్ శ్రీనివాసులు, సతీష్, బిఆర్ఎస్ నాయకులు శంకర్ ముదిరాజ్, మీడియా ఇంచార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, జీవై గిరి తదితరులు పాల్గొన్నారు.

## 19న రాజ్యాంగంపై జాతీయ సదస్సు

**ప్రజాపక్షం /హిమాయత్‌నగర్ :** భారత రాజ్యాంగంపై జాతీయ సదస్సుకు ఈ నెల 19న హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో నిర్వహించనున్నట్టు ఆలిండియా ఎస్‌సి, ఎస్‌టి రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ప్రెసిడెంట్ జి.మురళీధర్ రావు తెలిపారు. గురువారం హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా డా.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ గంటా చక్రపాణి, గౌరవ అతిథులుగా రిటైర్డ్ డిజి డా.జే.పూర్ణచందర్‌రావు, ప్రొ.పట్టా వెంకటేశ్వర్లు, రిటైర్డ్ జడ్జి నిమ్మ నారాయణ, ఇతర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. సదస్సులో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి సమస్యలపై చర్చ ఉంటుందని తెలిపారు. సమావేశంలో సొసైటీ కార్యదర్శి జనరల్ ఆర్.చంద్రశేఖర్, మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ధైర్యసాహసాలకు అగ్నిమాపక శాఖకు దేశస్థాయి గుర్తింపు

10 మంది సిబ్బందికి బ్రోంజ్ డిస్క్ అవార్డు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ అగ్నిమాపక శాఖ సిబ్బంది ధైర్యసాహసాలకు దేశస్థాయి గుర్తింపు లభించింది. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ జనరల్ ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్,హోం గార్డ్స్ నుండి రాష్ట్రానికి చెందిన 10 మంది సిబ్బందికి బ్రోంజ్ డిస్క్‌తో పాటు ప్రశంస పత్రాలు ప్రదానం చేయడం విశేషం.దేశవ్యాప్తంగా అగ్నిమాపక సేవలు, సివిల్ డిఫెన్స్, హోం గార్డ్స్ వంటి విభాగాల్లో విశిష్ట సేవలు, అపూర్వ ధైర్యం, విధి నిర్వహణలో చూపిన ప్రతిభకు ఈ ప్రతిష్టాత్మక అవార్డులు అందజేస్తారు. తెలంగాణ నుంచి ఈసారి పెద్ద సంఖ్యలో సిబ్బంది ఎంపిక కావడం ప్రత్యేకతగా నిలిచింది. ఈ అవార్డులు అందుకున్న వారిలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ బి. సుధాకర్ (గౌలిగూడ), లీడింగ్ ఫైర్ ఫైటర్స్ జి. యాదగిరి (సెక్రటేరియట్), ఎం.డీ. ఘౌస్ పాషా (గద్వాల్), గడ్డె కృష్ణప్రసాద్ , ఫైర్ ఫైటర్ టెక్నీషియన్లు సారా రాజేశ్వర్ (హయత్‌నగర్), వాగదాని రామ్ బాబు (ఖమ్మం), కె. వినోద్ కుమార్ (స్నోర్కెల్)తో పాటు ఫైర్ ఫైటర్లు ఎం. ప్రవీణ్ (గౌలిగూడ), జి. రాకేష్ కుమార్ (హైకోర్ట్), జుట్టుకొండ వెంకటేశ్వర్లు (హుజుర్‌నగర్) ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ అభినందనలు తెలిపారు. ఈ గుర్తింపు సిబ్బందిలో మరింత సేవాభావాన్ని పెంచి, సమాజంలో అగ్నిప్రమాదాలపై అవగాహన పెంచడంలో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ స్థాయిలో రాష్ట్ర సిబ్బంది పెద్ద సంఖ్యలో అవార్డులు అందుకోవడం ఇదే మొదటి సారి కావడం గమనార్హం.

## హక్కులు సాధించే వరకు పోరాటం ఆగదు




**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** తెలంగాణ ఉద్యమకారుల హక్కులు సాధించే వరకు పోరాటం ఆగదని జస్టిస్ చంద్రకుమార్, ఉద్యమకారుడు కాచం సత్యనారాయణ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం రాత్రి తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రామగిరి ప్రకాష్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలు, ఉద్యమకారుల కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 250 గజాల స్థలం, రూ.25 వేల పెన్షన్ వంటి హామీలపై ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. హామీల అమలుకు కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఉద్యమకారులు ఇప్పటికే అసెంబ్లీ ముట్టడి చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే నిర్దిష్ట కార్యాచరణ ప్రకటించకపోతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నర్సింహా, సాజీదా సికిందర్, బోగే పద్మ, సామ అంజిరెడ్డి పాల్గొన్నారు.

## గలేరియా మాల్‌లో వ్యక్తి మృతి

యాజమాన్యం నిర్లక్ష్యంతో సూపర్‌వైజర్ మృతి?

పివిఆర్ సినిమాస్ వద్ద బంధువుల ఆందోళన





**ప్రజాపక్షం/పంజాగుట్ట:** మెట్రో ఎర్రమంజిల్ గలేరియా మాల్ పివిఆర్‌లో శానిటేషన్ సూపర్ వైజర్ అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన కలకలం రేపింది. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పురానాపూల్‌కు చెందిన సత్యనారాయణ (40) గలేరియా మాల్‌లోని పివిఆర్ సినిమాస్‌లో హౌస్‌కీపింగ్ సూపర్ వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. మంగళవారం తన ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో పివిఆర్ యాజమాన్యానికి విధులకు హాజరు కావడం లేదని సమాచారం అందించాడు. యాజమాన్యం దానిని పట్టించుకోకుండా కచ్చితంగా విధులకు హాజరు కావాలి అని తెలపడంతో రాత్రి 10 గంటలకు డ్యూటీకి హాజరయ్యాడు. రాత్రి సుమారు ఒంటి గంట సమయంలో సత్యనారాయణకు తీవ్ర ఛాతినొప్పి వచ్చింది. ఈ విషయాన్ని యాజమాన్యానికి తెలియజేసినా వారు పట్టించుకోలేదని బంధువులు ఆరోపించారు. పరిస్థితి మరింత విషమించడంతో రాత్రి సుమారు 3:30 గంటలకు తన భార్య కల్పనకు ఫోన్ చేసి మాల్ వద్దకు రావాలని కోరాడు.. దీంతో అతని భార్య బంధువులకు సమాచారం అందించింది. మృతుడి సోదరుడు అక్కడికి చేరుకొని బాధితుడిని హుటాహుటిగా ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లాడు. అక్కడి వైద్యులు సత్యనారాయణను పరీక్షించిన అనంతరం అతను అప్పటికే మృతి చెందినట్లు తెలిపారని తెలిపారు. ఛాతిలో నొప్పి వచ్చిన వెంటనే ఆసుపత్రికి తరలించి ఉంటే తన భర్త ప్రాణాలు నిలిచేవి అంటూ మృతుడి భార్య కల్పన ఆవేదన వ్యక్తం చేసింది. యాజమాన్యం పని ఒత్తిడి, నిర్లక్ష్యం వల్లనే తన భర్త మరణానికి కారణమని ఆమె ఆరోపించింది. ఇక గలేరియా మాల్‌లోని పివిఆర్ సినిమాస్‌లో సాధారణంగా 10 మంది చేసే పనిని ఒక్కరితో చేయిస్తున్నారని, తీవ్రమైన పని ఒత్తిడి ఉందని సహోద్యోగులు తెలుపుతున్నారు. ఈ ఘటనపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మాదిగల జనాభాకు తగ్గట్టుగా రిజర్వేషన్లు ఇవ్వాలి

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ నరేశ్



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్:** కులగణన నివేదిక ప్రకారం మాదిగల జనాభాకు తగినట్టుగా 10 శాతం నుంచి 11శాతానికి రిజర్వేషన్లు కేటాయించాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా.గోవిందు నరేశ్ మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణలో తమ మాదిగ జనాభా 10 శాతం నుంచి 11శాతం ఉన్నదని, అంతే వాటా కేటాయించాలని మంద కృష్ణ మాదిగ చెప్పారని, ఆయన మాటలు కులగణన రిపోర్టుతో నిజమయ్యాయని తెలిపారు. వర్గీకరణ చట్టంతో 9శాతం రిజర్వేషన్ల ద్వారా మాదిగలకు అన్యాయం జరుగుతుందన్నారు. జనాభా ప్రకారం తక్కువ రిజర్వేషన్లు ఇచ్చినా నాడు స్వాగతించిన వారు జాతి ద్రోహులు అని ఆయన అభివర్ణించారు. ఇప్పటికైనా సిఎం రేవంత్ రెడ్డి మాదిగలకు అన్ని ప్రభుత్వ రంగాల నియామకాల్లో జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహాత్మ జ్యోతిబా పూలే ద్విశత జయంతి ఉత్సవ కమిటీలో మందకృష్ణ మాదిగను సభ్యులుగా నియమించిన ప్రధాని మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఎంఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షులు డా.చిప్పలపల్లి సోమశేఖర్ , రాష్ట్ర నేతలు కొమ్ము శేఖర్, టి.వినరసింహ మాదిగ,డా.పల్లెర్ల సుధాకర్,దప్పు మల్లికార్జున్, బైరపోగు శివకుమార్, అంభిక మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌పిఆర్ హిల్స్ క్రీడా మైదానం కాపాడుకుంటాం

బిఆర్ఎస్ జూబ్లీహిల్స్ ఇంచార్జి మాగంటి సునిత



**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** యువత కోసం దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఎంతో కష్టపడి తయారు చేసిన క్రీడా మైదానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకుని తీరుతామని బిఆర్ఎస్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇంచార్జి మాగంటి సునీత గోపీనాథ్ అన్నారు. ఎస్‌పిఆర్ హిల్స్ క్రీడా మైదానం యథాతథంగా క్రీడల కోసం కొనసాగకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆమె హెచ్చరించారు.గురువారం శ్రీనగర్‌కాలనీలోని కార్యాలయంలో రహ్మత్‌నగర్ డివిజన్ నేతలతో ఆమె సమావేశం అయ్యారు. ఎస్‌పీఆర్‌హిల్స్‌లో గోపీనాథ్ హయాంలో నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను ప్రజల వినియోగానికి తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని ఆమె కోరారు. మాగంటి గోపీనాథ్ కృషితోనే నియోజకవర్గంలో అభివృద్ధి సాధ్యమైందని ఆమె తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్ నాయకత్వంలో మాగంటి గోపినాథ్ ఆశయాలను కాపాడేందుకు ఎంత దూరమైనా వెళ్తామని పేర్కొన్నారు. సమావేశంలో చోటు, నాగరాజు, వజీద్, బషీర్, నజీర్, వసీం బేగం, అర్ఫాత్, గోపిచంద్, గఫూర్, బషీర్, ప్రసాద్, సాయి, నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆదేశాలు అమలా.. కోర్టుకు వస్తారా..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కింది కోర్టుల్లో పనిచేసే ఉద్యోగులకు ఓల్ పెన్షన్ స్కీం అమలు చేయాలన్న గత ఉత్తర్వులను ఎందుకు అమలు చేయలేదో చెప్పాలని ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి, న్యాయశాఖ కార్యర్శులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ నాటికి గత ఆదేశాలను అమలు చేయనిపక్షంలో వారిద్దరూ వ్యక్తిగతంగా హైకోర్టు విచారణకు హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసింది. 2004లో మహబూబ్‌నగర్ జిల్లా కోర్టు జారీ చేసిన నోటిఫికేషన్ వెలువడినప్పటికీ ఉద్యోగాల్లో 2005లో చేరారు.

## వేంనరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన మధుయాష్కీ గౌడ్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఢిల్లీలోని పార్లమెంట్‌లో గురువారం రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్‌రెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు కలిసి టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కీ గౌడ్ హాజరయ్యారు. ప్రమాణ స్వీకారం చేసిన వేం నరేందర్ రెడికి మధుయాష్కీగౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యే, ఆయన తనయుడు అరెస్ట్ : వ్యక్తిగత పూచిపై విడుదల




**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఆయన తనయుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డిలు ఇద్దరు గురువారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో సిఐ సమక్షంలో లొంగిపోయి వ్యక్తి గత పూచిపై విడుదల అయ్యారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సమయంలో 19వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరిని కిడ్నాప్ చేశారని, ఆయన కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, ఆయన తనయుడిపై కేసు నమోదులో భాగంగానే ఈ నెల 4న మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని, ఆయన తనయుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డిలను అరెస్ట్ చేసి వ్యక్తిగత పూచిపై స్టేషన్ బెయిల్ ఇవ్వాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశింటంతో ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో తండ్రి, కొడుకులు ఇద్దరు లొంగిపోయినట్లు సిఐ తెలిపారు.

## మహిళాసంఘాలకు చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/కేశంపేట:** మండల కేంద్రంలోని నూర్ ప్యాలెస్ లో 99రోజుల ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా మండల స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలకు రూ.56.65కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారిణి రమాదేవి, ఎంపిడిఒ రవిచంద్ర కుమార్‌రెడ్డి, తహసీల్దార్ రాజేందర్ రెడ్డి, ఎంఈఓ చంద్రశేఖర్, డాక్టర్ నికిత, ఎంపిఓ కిష్టయ్య, సిఐ నరహరితో పాటు సర్పంచులు, ఉపాధ్యాయులు, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## అన్నిరంగాల్లో అభివృద్ధి జరగాలి




**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి అధికారులంతీ కలిసి కట్టుగా పనిచేయాలని మండల ప్రత్యేకాధికారి మాధవరావ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని డిఎస్‌ఆర్ గార్డేన్‌లో 99 రోజుల ప్రజా పాలన ప్రగతిపై వివిధ శాఖల అధికారులతో చర్చ కార్యక్రమం జరిగింది. బ్యాంక్ లింకెజీ కింద 781 మహిళా సంఘాలకు చెక్కులను యాచారం మండల ఒబిలకు , వివిధ గ్రామాలకు చెందిన గ్రామ సంఘాల లీడర్లకు అంద జేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రాధ రాణి, తహసీల్దారు అయ్యప్ప, ఎంఇఒ పాండురంగారెడ్డి , వ్యవసాయధికారి అర్.రవినాథ్, ఎంపిఒ శ్రీలత, సూపరిండెంట్ శైలజా, వేటర్నరి వైద్యాధికారి రేఖా, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ తులసి పాల్గొన్నారు.

## శివారు కాలనీలకు బస్సుసౌకర్యం

హయత్‌నగర్ డిపో మేనేజర్‌కు వినతి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** హయత్ నగర్ డిపో–1 మేనేజర్ విజయ్‌ను గురువారం బియన్‌రెడ్డి నగర్ డివిజన్ శివారు కాలనీ వాసులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కాలనీ వాపులు మాట్లాడుతూ సాహెబ్ నగర్ మీదుగా ఇంజాపూర్‌కు వెళ్లే బస్సుల సంఖ్యను మరింతగా పెంచాలని మేనేజర్‌కు వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో బ్యాంక్ కాలనీ అధ్యక్షురాలు భవాని, జనరల్ సెక్రటరీ అరుణ్ కుమార్, శ్రీనివాస కాలనీ అధ్యక్షులు చిత్తరంజన్, జక్కిడి రామ్‌రెడ్డి కాలనీ అధ్యక్షులు నరేందర్ తదితరులు ఉన్నారు.

## మహిళల సంక్షేమమే లక్ష్యం



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** మహిళల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్తు కార్యాలయంలో 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జరిగిన మండల సమావేశానికి మార్కెట్ కమిటీ చైర్మన్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సదున్వియోగం చేసుకోని ఆర్థికంగా అభివృద్ధి చేందాలన్నారు. అనంతరం ఎస్‌ఎచ్‌జి గ్రూప్ మహిళలకు చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నవీన్ రెడ్డి, ఎంపిడిఓ ప్రమీలా, తహసీల్ధార్ సునిత, వ్యవసాయ అధికారి విద్యాధరి, మండల అధికారులు దివ్యా, వినీతాదేవి, రాధిక, హిర్యానాయక్ పాల్గొన్నారు.

# ఉపాధిహామీ నిధులతో పంచాయతీ భవనాలు

రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ దివ్య



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించుకునేందుకు సర్పంచ్‌లు కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ సూచించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ కార్యాలయం అవరణలో ఎంపిడిఒ బన్సీలాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 99రోజుల ప్రణాళికలో భాగంగా అరైవ్..అలైవ్ కార్యక్రమానికి దివ్య దేవరాజన్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోపాటు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. షాద్‌నగర్ ట్రాఫిక్ సిఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను, ఫరూఖ్‌నగర్ మండల వ్యవసాయ శాఖ అధికారి నిశాంత్‌కుమార్ ఏర్పాటు చేసిన డ్రోన్లు, వ్యవసాయ యంత్రాలను, ఐసిడిఎస్ శాఖ, మహిళా సమాఖ్య శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను దేవరాజన్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ దివ్యదేవరాజన్ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయం ఉంటే అభివృద్ధికి అస్కారం ఉంటుందన్నారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మహిళా సంఘాల ద్వారా యూనిఫాం సిద్ధం చేస్తున్నామని, జూన్ మొదటి వారంలో అంధించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ పాలకవర్గాలు, మహిళా సమాఖ్యలు పోటీ పడితే అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు. ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వందశాతం పూర్తి చేసేందుకు మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. హైద్రాబాద్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి.. విలువైన ప్రాణాలను కాపాడుకునేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ డిసిపి శిరీష సూచించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీ నారాయణ, జడ్పి సిఇఓ కృష్ణారెడ్డి, డిఆర్‌డిఏ పిడి శ్రీలత, ఆర్‌డిఓ సరిత, డిపిఓ సురేష్ మోహన్, మున్సిపల్ చైర్మెన్ బసవేశ్వర్, తహసీల్దార్ నాగయ్యతో పాటు సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

### నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులుగా చేయాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని..మహిళా మణులకు ఉపాధి కాంతులు కల్పించడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని దివ్య రావరాజన్ వివరించారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్ ఎంపిడిఒ కార్యాలయంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి. జడ్పి సిఇఒ కృష్ణారెడ్డిలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందని వివరించారు. పాలన సౌలభ్యం కోసం కొత్తగా ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీలకు, మండల కేంద్రాలకు శాశ్వత భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

# వైద్యపరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందించాలి

ఆరోగ్య శాఖ కమిషనర్ సంగీత నారాయణ




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా కొండాపూర్ ప్రభుత్వాసుపత్రిని ఆరోగ్య శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు 134 వైద్య పరీక్షలు సకాలంలో నిర్వహించి సరైన సమయంలో రిపోర్టులు అందించాలని ఆదేశించారు. రంగారెడ్డి జిల్లాలోని ఆసుపత్రుల మాతా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి ప్రతి గర్భిణీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అసంక్రమిత వ్యాధులైన రక్తపోటు, మధుమేహం సంబంధించిన రోగులకు సరైన మందులు, ఫాలోఅప్ నిర్వహించాలని వైద్యులను ఆదేశించారు. అదేవిధంగా దివ్యాంగులు ఆస్పత్రులకు సౌకర్యంగా వెళ్లేందుకు రైలింగ్ ర్యాంపు, వీల్ చైర్లు విధిగా ఉండాలని, వర్షపునీటి సేకరణ గొయ్యి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని డిఎంహెచ్‌ఇని ఆదేశించారు. బస్తీ దవఖానాలలో ఏర్పడ్డ వైద్యుల ఖాళీ పోస్టులను, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులను యూపిఎస్ లలో ఐసిటీ సెంటర్లలో భర్తీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి ఆదేశించారు. అనంతరం కొండాపూర్‌లోని నిర్మాణంలో ఉన్న గ్రామకేర్ సెంటర్‌ను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ సంగీత నారాయణ మాట్లాడుతూ జిల్లాలోని 30 శాతం ఆసుపత్రులు జాతీయ నాణ్యతా ప్రమాణాలు ఆమోదం పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి, కొండాపూర్ డిసిహెచ్‌ఎస్ డాక్టర్ అనురాగిణి, మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ చంద్ర కృష్ణ, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యకు పరిష్కారం

**ప్రజాపక్షం/కొందుర్గు:** మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ గ్రామంలో మంచి నీటి సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి బోరు వేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వనాథ్‌పూర్ గ్రామపంచాయతీలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు స్పంధించి కొత్తగా బోరు మోటర్ వేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలత రాములు, కొందుర్గు సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, ఉమ్మెంతాల సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్‌రెడ్డి, మహదేవ్‌పూర్ సర్పంచ్ అనూష రవీందర్‌రెడ్డి, ముష్టిపల్లి సర్పంచ్ కన్న జంగయ్య, ఎదిర సర్పంచ్ విజయలక్ష్మి దామోదర్‌రెడ్డి, మల్కాపహాడ్ సర్పంచ్ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులు పరిశీలించిన ఎమ్మెల్యే శంకర్



**ప్రజాపక్షం/కొందుర్గు:** రాష్ట్ర ప్రభుత్వం ఎప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. గురువారం కొందుర్గు మండల కేంద్ర సమీపంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలను సందర్శించి నిర్మాణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయంలో నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టేందుకు కృషి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్, చిల్కమర్రి నర్సింలుతోపాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు ఇవ్వండి

మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి టియుడబ్ల్యుజె వినతి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** అక్రిడిటేషన్ జివొను సవరించి రంగారెడ్డి జిల్లా పరిధిలోని జిహెచ్‌ఎంసి మండలాలలో ప్రధాన దినపత్రికలలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌లు అందించి న్యాయం చేయాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని కోరుతూ టియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎండి సలీమ్ పాషా, కార్యదర్శి మేకల సత్యనారాయణలు వినతిపత్రం అందజేశారు. అక్రిడిటేషన్ల కోసం నూతనంగా తీసుకువచ్చిన జిఒ నెంబర్ 252, ఆ తదుపరి వచ్చిన జిఒ వల్ల రంగారెడ్డి జిల్లాలో ప్రధాన దినపత్రికలలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడిటేషన్‌లు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రంగారెడ్డి జిల్లా సగానికి పైగా జిహెచ్‌ఎంసిలో విలీనం కావడమే కాగా, పెద్ద మండలాలను కలిగి మున్సిపాలిటీలు, రూరల్, అర్బన్ మండలాలుగా ఉన్నాయి. ప్రధాన పత్రికలలో ప్రతి మండలానికి ముగ్గురు నుంచి ఆరు మంది వరకు విలేకరులు వార్తా సేకరణ చేస్తున్నారు. నూతన జీవో వల్ల మండలానికి ఒక్కటే అక్రిడిటేషన్ విధానం వల్ల పనిచేసే జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు రాని పరిస్థితి నెలకొందన్నారు. ముఖ్యంగా గ్రామీణ నియోజకవర్గాల్లో ఐదు నుండి ఆరు మండలాలుగా ఆరు కార్డులు వస్తుండగా, గ్రేటర్ పరిధిలోని శేరిలింగంపల్లి నియోజకవర్గం 85 శాతం ఒక్క శేరిలింగంపల్లి మండలంలోనే ఉండగా 7 వార్డులు పాత జిహెచ్‌ఎంసిలో ఉండగా తాజాగా 18 వార్డులు ఏర్పడ్డాయన్నారు. ఇక్కడ అన్నీ ప్రధాన పత్రికలలో కనీసం నలుగురి నుండి ఐదారు మంది వరకు పనిచేస్తున్నారు. ఇదే పరిస్థితి ఎల్ బి నగర్ రాజేంద్రనగర్, మహేశ్వరం, జిహెచ్‌ఎంసి పరిధిలో ఉందని, ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని రంగారెడ్డి జిల్లాలో ప్రధాన పత్రికలలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు న్యాయం చేసే విధంగా జిఒను సవరించాలని విజ్ఞప్తి చేశారు.

# స్వయం సహాయ సంఘాలకు చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** స్వయం సహాయ సంఘాల సభ్యులకు రూ.58.56 కోట్ల చెక్కులను రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమీషనర్ దివ్య, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అంధించారు. గురువారం ఫరూఖ్‌నగర్ ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అరైవ్..అలైవ్ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులకు రూ.58.56కోట్ల చెక్కులు, కిషన్‌నగర్ గ్రామ పంచాయతీలో 41మంది ఇందిరమ్మ లబ్దిదారులకు రూ.1.16కోట్ల 60వేల చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఫరూక్‌నగర్ మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు సెల్ ఫోన్లు పంపిణీ చేశారు. కళ్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను సైతం లబ్దిదారులకు అందించారు. అదే విధంగా దివ్యాంగులకు స్కూటీలను పంపిణీ చేశారు. అంగన్‌వాడడీ కేంద్రంలోని చిన్నారులకు యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ఈ స్థాయిలో అమలు చేస్తుండటం ఎ అభినందనీయమని పేర్కొన్నారు. అధికారులు చేస్తున్న పనులపై ఉన్నత స్థాయిలో అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, మహిళా సమాఖ్య, ఉపాధి హామీ, వ్యవసాయ శాఖ, పంచాయతీ రాజ్‌శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు

కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/కడ్తాల్:** పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నా రు. గురువారం కడ్తాల్ మండల కేంద్రంలో ఎంబిఎ గార్డెన్‌లో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాలలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామన్నారు. సర్పంచ్‌లు గ్రామాలలో సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాగా స్పందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యం విద్యుత్ మంచినీటి వసతులతో పాటు మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మండలంలోని 24 గ్రామపంచాయతీలకు సంబంధించి 36 కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ప్రజా ప్రతినిధులు అధికారులకు కలిసి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా బిసి అభివృద్ధి బి కేశరామ్, అగ్రికల్చర్ డి.సురేష్, ఎఎంసి చైర్మన్ యాట గీత నరసింహ, వైస్ చైర్మన్ గుడురు భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ బిక్షపతి, తహసీల్దార్ జయశ్రీ, ఎంపిడిఒ సుజాత, సిఐ గంగాధర్, ఎపియం రాములు, సిసిలు మండల అధికారులు, సర్పంచులు కార్యదర్శులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరాకు ప్రాధాన్యం

దండిగా 15వ ఆర్థిక సంఘం నిధులు

526 జిపిల ఖాతాల్లో

ఆరు విడతల్లో రూ.65 కోట్లు జమ

పాలక మండళ్ల తీర్మానం మేరకు చెల్లింపులు

ప్రజాపక్షంతో రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి వి.సురేష్ మోహన్

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమవ్వాలంటే పల్లెటూర్ల అభివృద్ధి అత్యంత ముఖ్యం. అలాంటి పల్లెటూర్ల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా నిధులు మంజూరు చేస్తున్నాయి. ఆస్తి పన్ను వసూళ్లు,అంతర్గత వనరులతో సమకూరిన ఆదాయంతో పాటు 15వ ఆర్థిక సంఘం నుంచి గత ఆరు విడతల్లో రూ.65 కోట్లకుపైగా నిధులు విడుదలయ్యాయి. ప్రభుత్వం ఇచ్చిన ప్రతిపైసాను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి పల్లెను అభివృద్ధిలో అగ్రభాగాన నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి(డిపిఒ) వి.సురేష్‌మోహన్ చెప్పారు. ఈ మేరకు ఆయన 'ప్రజాపక్షం'ప్రతినిధి మాట్లాడుతూ జిల్లాలోని 21 రూరల్ మండలాల పరిధిలో 526 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో 2,70,708 లకు అసెస్మెంట్ చేయగా, వీటి నుంచి రూ.78.06,021 వసూలైంది. వీటితో పాటు 15వ ఆర్థిక సంఘం ద్వారా మరో రూ.65.03 కోట్లు జమైంది. దీనిలో 50 శాతం నిధులు పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరాకు ఖర్చు చేయాలని, మిగిలిన మరో 50 శాతం నిధుల నుంచి (జీతాలతో సహా)ఇతర అభివృద్ధి పనులకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

### ఆ ఖాతా నుంచే వారి వేతనాలు చెల్లింపు

ప్రస్తుతం ఆయా పంచాయతీల పరిధిలో 3016 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో ఒక్కొక్కరికి నెలకు సగటున రూ.9,500 వేతనం చెల్లిస్తున్నాం. ప్రత్యేకాధికారుల పాలనలో ఉన్నప్పుడు ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధులు రాలేదు. దీంతో ప్రభుత్వమే వారికి వేతనాలు చెల్లించింది. ప్రస్తుతం ఆయా పంచాయతీల ఖాతాల్లో నిధులు పుష్కలంగా ఉన్నాయి. మూడు నెలల క్రితమే ప్రభుత్వం వారి వేతనాలు నిలిపివేసింది. పంచాయతీ ఖాతాల్లో ఉన్న నిధుల నుంచే వారికి వేతనాలు చెల్లించాలని సూచించడంతో ఆ మేరకు చెల్లింపులు చేస్తున్నాం. అంతేకాదు చనిపోయిన 55 మంది కార్మికుల కుటుంబాలకు నేషనల్ ఫ్యామిలీ బెన్‌ఫిట్స్ పథకం కింద ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాం. అయితే ఆయా లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.



### తీర్మానాల మేరకే చెల్లింపులు

పాలక మండళ్ల తీర్మానం మేరకే బిల్లులు చెల్లించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశాం. అది కూడా ఆరు నెలల ముందు సప్లిమెంటరీ ప్లాన్‌లో భాగంగా అనుమతించిన పనులకు మాత్రమే చెల్లింపులు చేయాలని సూచించాం. పేమెంట్ జనరేట్ చేసే విషయంలో కొంత మంది కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారు. అవగాహన లేకుండా బిల్లులు జనరేట్ చేస్తుండటంతో ప్రొసిజర్ ల్యాప్ వస్తున్నాయి. గ్రామ పంచాయతీలో జమ అయిన ప్రతి రూపాయి... ఖర్చు లెక్కలు ఈ గ్రామ్ స్వరాజ్ ఫోర్టల్‌లో ఎంటర్ చేయాల్సిందే.

### 126 ఫైల్స్ క్లీయర్ చేశాం.

ఇప్పటికే జిపిలను పూర్తిగా కంప్యూటీకరించాం. పంచాయతీ ఆఫీసును ఈ ఆఫీసుగా మార్చేశాం. ఇప్పటికే 126 ఫైల్స్ క్లీయర్ చేశాం. మండల స్థాయి మీటింగ్‌లు ఏర్పాటు చేసి, ట్రాఫిక్, రోడ్ సేఫ్టీ, పారిశుధ్య నిర్వహణపై అవగాణ కల్పిస్తున్నాం. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నిర్వహించే సభలు, సమావేశాలకు జిపి స్థాయిలో రూ.10 వేలు, మున్సిపల్/మండల స్థాయిలో రూ.2లక్షలు, నియోజకవర్గం స్థాయిలో రూ.10 లక్షలు, జిల్లా స్థాయిలో రూ.50 లక్షలు చెల్లించేందుకు ప్రభుత్వం అనుమతించిందని పేర్కొన్నారు




## పారిశుద్ధ్య కార్మికుడికి న్యాయం జరగాలి

### తెలంగాణా మున్సిపల్ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్ యూనియన్

**ప్రజాపక్షం/కాప్రా:** విధి నిర్వహణలో విద్యుద్ఘాతానికి గురై చికిత్స పొందుతున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ పారిశుద్య కార్మికుడు ఎం.రాజశేఖర్‌ను సనత్‌నగర్‌లోని ఇఎస్ఐ ఆస్పత్రిలో తెలంగాణా మున్సిపల్ కంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేసురత్నం, రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డిలు గురువారం పరామర్శించారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో పనిచేసే కార్మికుడు రాజశేఖర్ అధికారుల ఆదేశాల మేరకు తెల్లవారు జామున పాపిరెడ్డికాలనీ కమాన్‌కు వేసిన ఫ్లెక్సీలు తొలగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతానికి గురయ్యాడన్నారు.పారిశుద్ధ్య కార్మికుడి విధులకు సంబంధం లేని విధంగా ఫ్లెక్సీలు తొలగించే పనులు చెప్పి ప్రమాదానికి కారకులైన బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో బాధితుడికి న్యాయం జరిగేలా తాము పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.



## ఉద్రిక్తంగా మారిన మహనీయుల విగ్రహాల తొలగింపు...



**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి చౌరస్తాలో మహనీయుల విగ్రహాలను తొలగించడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పెద్ద చర్లపల్లిలో గత మూడు రోజుల క్రితం ఏర్పాటు చేసిన జ్యోతిబాపులే, బిఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించారని పేర్కొంటూ స్థానికులు, దళిత సంఘాలు, యువజన సంఘాలు, పలు పార్టీలకు చెందిన నాయకులు తరలివచ్చి నిరసన తెలియజేస్తూ ఆందోళన చేపట్టారు. దీంతో విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, నాయకులు నేమూరి మహేష్‌గౌడ్, పలు పార్టీల నాయకులు జె సత్తిరెడ్డి, కె జనార్ధన్, కె నర్సింగ్, ఆర్ రాంచందర్‌గౌడ్, డి గిరిబాబు, తదితకెలె స్థానికులతో కలసి ఆందోళన చేపట్టారు. బందోబస్తు ఏర్పాటు చేసిన సిఐ సుధాకర్‌కు నాయకులు, దళిత సంఘం నాయకులు విగ్రహాలను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆందోళన చేస్తున్న వారిని అరెస్టు చేసి ఘట్కేసర్ పిఎస్‌కు తరలించారు.

**మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లిన మాజీ మేయర్**

విగ్రహాలు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కార్పొరేటర్ శ్రీదేవిలు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. విగ్రహాల తొలగింపు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, తొలగించిన విషయంలో ఆందోళన చేపట్టిన వారిని విడుదల చేయాలని కోరామని వారు తెలిపారు.

## దొంగతనానికి వెళ్లి గొంతు కోసి పరార్

**ప్రజాపక్షం/కొడంగల్ :** దొంగతనానికి వెళ్లి ఇంటి యజమానిని కత్తితో గొంతుపై గాయంచేసిన సంఘటన దౌల్తాబాద్ మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ వేణుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన మూతుల అంజిలమ్మ ఇంట్లో రాత్రి సమయంలో 10గంటలకు రయి అందం పెట్టుకోని రాత్రి 2.30 గంటలకు ఇంట్లో వస్తువులు సర్దుతున్న శబ్దం రావడంతో, మెలుకువ వచ్చిలేచి చూడగా గ్రామానికి చెందిన వరప్రసాద్, అనే వ్యక్తి రావడంతో ఆమె కేకలు వేసింది. తన దగ్గర ఉన్న కత్తితో ఆమె గొంతు కొయ్యగా గాయం అయిందని, వెంటనే అతనిని పక్కకు నెట్టటంతో అక్కడి నుండి పారిపోయాడని ఆమె పోలీసులకు తెలిపింది. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

## కల్వర్టు గుంతలో పడి వ్యక్తి మృతి



**ప్రజాపక్షం /పరిగి :**కల్వర్టు గుంతలో పడి ఓవ్యక్తి మృతి చెందిన ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మృతుడి భార్య ఫిర్యాదు తన భర్త మహమ్మద్ చాంద్‌పాషా కొత్త బట్టలు తెచ్చుకోవడానికి తన టివిఎస్ బండిపై పరిగి వచ్చి తిరిగి ఇంటికి రాకపోయేసరికి చుట్టు పక్కల తెలిసినవారిని అడిగామని, గురువారం ఉదయం మరిది తాజోద్దిన్ ఫోన్ చేసి చంద్‌పాషా ఖుదవన్ పూర్ కల్వర్టు గుంతలో పడి చనిపోయడని తెలుపగా వెంటనే పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చూశాను అని ఆమె తెలిపింది, పరిగి షాద్‌నగర్ ప్రధాన రహదరిపై కల్వర్టు దగ్గర భారీగా త్రవ్వి గుంత దగ్గర ఎలాంటి సూచిక బోర్డుకు రేడియం స్టికర్లు లేకపోవడంతో చీకటిగా ఉండడంతో గుంతలోపడి చనిపోయాడని దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## ఉత్తరాదిలో లబ్ధికోసం బిజెపి హైడ్రామా

### తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:**కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న డీలిమిటేషన్ పక్రియ శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని, డీలిమిటేషన్ ప్రక్రియతో దక్షణాది రాష్ట్రాలకు ముప్పు ఉందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి తెలిపారు. గురువారం తాండూరు మున్సిపల్ సమావేశం అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చైర్‌పర్సన్ నీరాజబాల్‌రెడ్డితో కలసి మీడియాతో మాట్లాడారు. బిజెపి ప్రభుత్వం దొడ్డిదారిలో మళ్ళి అధికారం చేపట్టేందుకు డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెడుతుందని విమర్శించారు. డీలిమిటేషన్ బిల్లు, మహిళ రిజర్వేషన్ బిల్లులను వేరువేరుగా ప్రవేశపెట్టాల్సి ఉండేదని అభిప్రాయ పడ్డారు. డీలిమిటేషన్ బిల్లులు పూర్తి ఆశాజనకంగా లేదని దీనిని కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తుందని స్పష్టంచేశారు. మహిళ రిజర్వేషన్ బిల్లులను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం 33శాతం రిజర్వేషన్లతో ప్రవేశపెట్టాలని నిర్ణయించిందని గుర్తుచేశారు. బిజెపి ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని, డీలిమిటేషన్ ప్రక్రియకు మాతం తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు.2011జనాభా ప్రకారం డీలిమిటేషన్ చేపట్టడం లేదని, ఇప్పుడున్న జిఎస్టీ ద్వారా ఆదాయం మర్గాల ద్వారా దక్షణాధి రాష్ట్రాల నుండి లబ్దిపొందుతున్నారని తెలిపారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పోరాటానికి సిద్ధమన్నారు. ఈ మీడియా సమావేశంలో చైర్‌పర్సన్ నీరాజాబల్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

### రేషన్ కార్డు నిరంతర ప్రక్రియ

### తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్



**ప్రజాపక్షం/బంట్వారం :** మండల ప్రజా పరిషత్తు కార్యాలయం ఆవరణలో ఎంపిడి ఒ రాములు అధ్యక్షతన గురువారం ప్రజా పాలన ప్రగతి నివేదిక 99 రోజుల ప్రణాళిక సమావేశం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి గ్రామానికి ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయడం జరిగిందన్నారు.

99 రోజుల ప్రణాళికలో భాగంగా ఆయా శాఖల అధికారులు వారి నివేదికను సమర్పించి, గ్రామాల్లో నెలకొన్నటువంటి సమస్యలను శాసన సభాపతి దృష్టికి తీసుకురావడం జరిగింది. ప్రతి సమస్య పట్ల తగు చర్యలు తీసుకోని సమస్యలు పరిష్కార మార్గం చూపుతామన్నారు. గత మార్చి నెల 6 నుంచి నేటి వరకు జరిగినటువంటి ప్రణాళికలో భాగంగా పాఠశాలలో అంగన్‌వాడీలు పరిశుభ్రం చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేరుస్తుందని, ముందుగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 2వందల యూనిట్ల ఉచిత విద్యుత్ అందింస్తుందన్నారు. గత ప్రభుత్వం ప్రజలకు పదేళ్ళ కాలంలో ఇవ్వలేని రేషన్ కార్డులను 95 లక్షల రేషన్ కార్డులకు మంజూరు చేసి ఉచితంగా సన్నబియ్యం అందజేస్తున్నామన్నారు. 200 కోట్ల రూపాయలు ప్రతి నియోజకవర్గాని కి ఒక ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు మంజూరు చేసి ప్రారంభం చేసుకున్నామని, వాటిలో చదువుకున్న విద్యార్థులను ప్రపంచంలోనే గేమ్ చేంజర్స్ గా నిలబెడతామని అన్నారు. అంతేకాకుండా ప్రతి మండలానికి ఒక పబ్లిక్ స్కూలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో గత పదేళ్ళుగా రోడ్ల పరిస్థితి దారుణంగా మారిందని గుర్తించి కొత్తగడి నుంచి వయా మోత్కుపల్లి, బార్వాద్ మీదుగా బంట్వారం, యాచారం ఎక్స్ రోడ్ నుంచి బంట్వారం, బంట్వారం నుంచి తొర్మామిడి గ్రామాలకు రోడ్లు మంజూరు కావడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు పర్యాటకం అభివృద్ధి కృషి చేస్తూ, ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు చేయడంతో స్థానికులకు ఉపాధి పెరుగుతుందన్నారు. మండల కేంద్రంలో ఆయా గ్రామాల 28 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి వేంకటేశం, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు బర్కత్‌పల్లి విజయలక్ష్మీ నర్సింలు, మాలసోమారం సర్పంచ్ మేతరి కమలమ్మ, తోర్‌మామిడి సర్పంచ్ మాచపరి సంజీవయ్య, సల్‌బత్తాపూర్ సర్పంచ్ బుర్నపురి బాలయ్య, మాద్వాపూర్ సర్పంచ్ గోరేమియా, పలు శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

**ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి**

**మోమిన్‌పేట్ :** ప్రతిప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని తెలంగాణ రాష్ట్ర స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం మోమిన్ పేట్ మండల కేంద్రంలోని ఏజేఆర్ పంక్షన్‌హల్ ఏర్పాటు చేసిన అబ్దుల్ సమద్ పదవీ వరమణ సమావేశానికి ముఖ్యఅథిగా హాజరై మాట్లాడుతూ పాఠశాలలో ఎక్కడ పని చేసినా అంకితభావంతో పనిచేసి ఆయా విద్యార్థులు తల్లిదండ్రుల మన్ననలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో బహుదూర్పర ఎమ్మెల్యే ముబిన్, మాజీ ఎమ్మెల్సి సుధాకర్ రెడ్డి,హబ్రిత్ షరిప్, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, విజయ్‌కుమార్, నరోత్తం రెడ్డి, తదితరులు పాల్గొని సన్మానించారు.



## ఆక్రమించిన ఫుట్‌పాత్‌ల తొలగింపు

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ సర్కిల్ పరిధిలో గండిమైసమ్మ చౌరస్తా నుండి మియాపూర్ రోడ్డు, రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్ ఆక్రమించుకొని నిర్మించిన అక్రమ నిర్మాణాలను సుమారుగా 37 సర్కిల్ అధికారులు తొలగించారు. ఉన్న ఆక్రమిత నిర్మాణాలను ప్రతిరోజు గుర్తించి తొలగించడం జరుగుతుందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్, ఎసిపి శ్రీనివాస్, టివిఎస్ ముఖేష్ సింగ్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# వీధి వ్యాపారులను వీధిన పడేయొద్దు

### సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్



**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ :** రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న 99రోజుల ప్రజా పాలన పేరిట ఆక్రమణల తొలగింపులో భాగంగా వీధి వ్యాపారులను తొలగించడం అన్యాయమని, వెంటనే అటువంటి నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ తీవ్రంగా విమర్శించారు. గురువారం సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో షాపూర్‌నగర్‌లోని ఇండస్ట్రీయల్ కార్యాలయంలో మేనేజర్ శ్రీవాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీనగర్ పారిశ్రామికవాడలో గత 30 సంవత్సరాలుగా రోడ్డు నుంచి 10అడుగుల దూరంలో చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేదవారిని తొలగించడం వారి కుటుంబాలను రోడ్డున పడేయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్‌కు లేదా ప్రజలకు ఇబ్బంది కలిగించని వీధి వ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. ఇప్పటికే ప్రభుత్వం వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు, రుణాలు ఇచ్చిందని, అటువంటి పరిస్థితిలో వారి ని తొలగించడం సరైంది కాదని తెలిపారు. వీధి వ్యాపారులకు వర్తించే చట్టాలను అమలు చేసి వారికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. కిరాయిలు చెల్లించే స్థోమత లేకపోవడంతోనే వారు రోడ్డుపై వ్యాపారం చేస్తున్నారని, ప్రభుత్వం మీద ఆధారపడకుండా స్వయంగా జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. అలాంటివారిపై మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు.

గతంలో ఇదే సమస్య తలెత్తినప్పుడు అప్పటి మేనేజర్ మాధవి క్షేత్రస్థాయిలో పరిశీలించి వ్యాపారులు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించడంలేదని నిర్ధారించి, వారికి నష్టం జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి అనుబంధ వీధి వ్యాపారుల సంఘం అధ్యక్షులు జావిద్, కార్యదర్శి యాదగిరి, సంఘం నాయకులు చాంద్, ఖాన్, జుబేర్, ఆదిల్, మహేష్, రవీందర్‌సింగ్, శ్రీపత్, ముస్తఫా, వీధి వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి అధికారులు తక్షణమే స్పందించాలి



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సేవలను వేగవంతంగా అందించేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్య క్రమంలో భాగంగా నవాబుపేట మండలంలోని అత్తాపూర్ గ్రామ సర్పంచ్ మేకల సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చేయాలంటే అధికారులు కూడా తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించినట్లయితే గ్రామాల అభివృద్ధి చెందుతుందని అన్నారు. గ్రామాలలో నకిలీ విత్తనాలు అరికట్టే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామాలలో విద్యుత్ స్తంభాల సమస్యలు ఉండి విద్యుత్ అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. విద్యుత్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరినారు. గ్రామంలో మూతబడ్డ పాఠశాలను పునః ప్రారంభం చేయాలని, మహిళ అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలను గురించి మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. గ్రామంలోని గ్రామకంఠ భూములు కబ్జాలు చేస్తున్నాకె, రోడ్డు విస్తృతం చేసే పనులకు ఆటంకాలు అవుతున్నాయి కాబట్టి వారిపై చర్యలు తీసుకోవా లన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడు తూ, పాఠశాలను వచ్చే సంవత్సరం నుంచి ప్రారంభిస్తామని హామీ ఇచ్చా రు. నకిలీ విత్తనాలను అరికట్టే విధంగా చర్యలు తీసుకుంటామని, గ్రామంలో నెలకొంటున్న సమస్యలపై తక్షణమే పరిష్కార దిశగా పనులు చేర్పిస్తామని మండల ప్రత్యేక అధికారి హామీ ఇవ్వడం జరిగింది.

## మురుగునీటి రహిత వాతావరణాన్ని ప్రజలకు అందించాలి

### బిఆర్ఎస్ ఎల్పీ విప్ కెపి వివేకానంద అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ప్రజలకు సక్రమమైన మంచినీరు, మురుగునీటి రహిత వాతావరణాన్ని అందించే దిశగా చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అధికారులను ఆదేశించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పేట్‌బషీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలమండలి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లు, సర్కిళ్లలో భూ గర్భ డ్రైనేజీ, త్రాగునీటి పైపులైన్ కనెక్షన్‌ల నిర్మాణం, పైపులైన్‌ల మరమ్మతు పనులపై వివేక్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ సుమారు రూ.2.04 కోట్ల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, త్రాగునీటి సరఫరా పైపులైన్ పనులను త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లు, బస్తీలు, కాలనీలలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ఇప్పటికే చేపట్టిన భూగర్భ డ్రైనేజీ, త్రాగునీటి సరఫరా పనులను ప్రాధాన్యత క్రమంలో చేపట్టేందుకు ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. రోజురోజుకి పెరుగుతున్న జనాభాకు, వెలుస్తున్న కాలనీలకు అనుగుణంగా పనులను పూర్తి చేయాలని అన్నారు.

ప్రజలకు స్వచ్ఛమైన త్రాగునీరు అందించే దిశగా ముందుకువెళ్లాలని, అవసరాలకు అనుగుణంగా రిజర్వాయర్లను నిర్మించి భవిష్యత్తు అవసరాలకు సరిపోయే విధంగా త్రాగునీటిని అందించాలని ఆదేశించారు. వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ప్రజలకు నీటిని సరఫరా చేసేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో జిఎంలు మాధవి, పరిమళ, వివిధ సెక్షన్ల డిజిఎంలు, మేనేజర్‌లు పాల్గొన్నా రు.

**సుచిత్ర చౌరస్తాలో చలివేంద్రం ప్రారంభం..**

జీడిమెట్ల డివిజన్ సుచిత్ర చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ మండుతున్న వేసవి తాపానికి చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ప్రధాన చౌరస్తాలలో ఇలాంటి చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

## ఎండ తీవ్రతకు ముందస్తు జాగ్రత్త చర్యలు

### కలెక్టర్ దీపక్ తివారి అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్, మే, జున్ వరకు ఎండ తీవ్రత ఉన్నందువలన తగు జాగ్రత్తలు తీసుకునేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్ట ర్ దీపక్‌తివారి అధికారులను ఆదేశించారు. గురువారం వీడియో కాన్పరెన్స్‌లో వేసవి తీవ్రతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా పలు జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని, డిఆర్‌డిఎ, ఆర్‌అండ్ బి, పంచాయతీరాజ్, విద్యుత్, ఆరోగ్య శాఖ,శిశుసంక్షేమశాఖ, అగ్ని మాపకశాఖ, అటవీ శాఖ, గ్రౌండ్‌వాటర్, మిషన్ భగీరథపై సమీక్ష నిర్వహించి వేసవిలో మధ్యాహ్నం 12గంటల నుండి 3గంటలకు వరకు బయటకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. తలపై గుడ్డ లేదా టోపి ధరించాలని తెలిపారు. వరి కోనుగోలు కేంద్రాలలో షెడ్డు త్రాగు నీరు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎండతీవ్రతపై టోల్ ప్రీ నెంబర్ 0841623591 ఉదయం 10గంటల నుండి సాయత్రం 5గంటలవరకు పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, వెంకటచారి, డిఆర్‌డిఎ శ్రీనివాస్ డిపి జయసుధ, మున్సిపల్ కమిషనర్, విక్రంసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## వినయ్ మాదిగకు దళితరత్న అవార్డు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** వికలాంగుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న వికలాంగుల హక్కుల పోరాట సమితి మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎన్.వినయ్ మాదిగకు అంబేద్కర్ జయంతి సందర్భంగా దళితరత్న అవార్డుతో సత్కరించారు. రవీంద్ర భారతిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అంబేద్కర్ వారోత్సవాల కార్య క్రమంలో ఎస్సీ సంక్షేమ అసోసియేషన్, ఎంఆర్ పిఎస్ సంయుక్తంగా ఈ అవార్డును అంద చేసారు. ఈ కార్యక్రమంలో థిప్పరపు లక్ష్మణ్, కనక రాజు, మనోహర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుడు చనిపోతే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలి

### మున్సిపల్ రాష్ట్ర నాయకుడు కల్లూరి జయచంద్ర



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** మున్సిపల్ కార్మికులు ఆనారోగ్యంతో మరణించిన కుటుంబీకులకు వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని రాష్ట్ర మున్సిపల్ నాయకులు కల్లూరి జయచంద్ర, అధ్యక్షులు లొట్టి ఈశ్వర్, మున్సిపల్ అధ్యక్షురాలు సువర్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంచాల రాంచందర్‌లు గురువారం జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ వాణిరెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మున్సిపల్ నాయకులు కల్లూరి జయచంద్ర మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వివిధ కేటగిరిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికుల వేతనంలో పిఎఫ్ కోత విధించినప్పటికీ వారి అకౌంట్‌లో సక్రమము గా జమ కావడం లేదు. 60 సంవత్సరా లు పైబడిన, మరియు మరణించిన కుటుంబీకులకు వారసత్వ ఉద్యోగాలు కల్పించాలని కోరారు. మున్సిపల్ కార్మికులు 60 సంవత్సరా లు ఉన్న మరి కొంతమంది అనారోగ్యంతో బాధపడుతున్న 25మంది కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని గత కొన్ని నెలలుగా సర్కిల్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఎన్ని లేఖలు ఇచ్చినప్పటికీ నేటికి కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా విచారణ చేసి కార్మిక కుటుంబానికి తక్షణమే ఉద్యోగ నియమకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## ప్రైవేట్ ఆస్పత్రుల వివరాల కోసం ప్రత్యేక సర్వే

### నెలలోగా పూర్తి చేయాలంటూ డిఎంహెచ్ఒ ఆదేశాలు





**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** జిల్లాలోని ప్రయివేట్ ఆస్పత్రుల పూర్తి వివరాల కోసం ప్రత్యేకంగా సర్వే నిర్వహించి జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయానికి నెల రోజుల్లోగా పంపించాలని జిల్లా వైద్యాధికారులను జిల్లా వైద్యారోగ్యాధికారి డాక్టర్ ఉమారాణి ఆదేశించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో గురువారం ఇతర అధికారులతో కల్సి నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా వైద్యాధికారులకు దీనికి సంబంధించిన పూర్తి బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లాలోని వైద్యాధికారులు తప్పనిసరిగా ఆభా హాజరీని సమయానికి నమోదు చేసి ఆ వివరాలను సంబంధిత గ్రూప్‌లలో పోస్టింగ్ చేయాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తీసుకొంటామని ఆమె హెచ్చరించారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో రోగులకు అవసరమైన మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడటం, దీంతో పాటు తమ వద్దకు వచ్చిన మందుల ఎక్స్‌పైరీ డేట్‌ను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ గడువు ముగిసే మందులను ప్రత్యేకంగా భద్ర పరచటం ద్వారా రోగులకు పంపిణీ కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాతృ ఆరోగ్యం, పోషణ, కుటుంబ నియంత్రణ, టీకాలు, సంక్రమణ, అసంక్రమణ వ్యాధులు, వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతి, సిబ్బంది ఖాళీలు, ఔషధ నిల్వలు వంటి పలు అంశాలపై చర్చించారు. చిన్న పిల్లల టీకా కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. గర్భిణీల సేవలు, ముఖ్యంగా రక్త హీనత, హై రిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రసవ సేవలు సక్రమంగా అందేలా చూడటం ద్వారా మాతృ మరణాలను నివారించాలన్నారు. టిబి, ఎన్‌సిడి సంబంధిత రోజువారీ సేవలను నిర్లక్ష్యం చేయరాదని, ప్రతి ఆరోగ్య కేంద్ర ం కనీస ప్రమాణాలను పాటిస్తూ అవసరమైన మందులు, పరికరాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.

## రేపు జిల్లావ్యాప్తంగా నల్ల బ్యాడ్జీలతో నిరసనలు

**ప్రజాపక్షం/వికారాబాద్:** రేపు జిల్లా వ్యాప్తం గా నల్ల బ్యాడ్జీలతో నిరసనలకు పిలుపునిచ్చిన జిల్లా జెఎసి నాయకులు చైర్మన్ శివకుమార్, జ్ఞానేశ్వర్, చంద్రశేఖర్,బాలకృష్ణ, రఘువేందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రెవెన్యూ భవన్‌లో జరిగిన సమావేశంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించడానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటు న్న 6 ప్రధాన సమస్యలను గుర్తించి ముందుగా వాటి పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించడం జరిగింది అన్నారు.

ఏప్రిల్ 17న మధ్యాహ్నం 1.10 నిమిషాలకు భోజన విరామ సమయంలో, అన్ని మండల, జిల్లా కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని, జిల్లా కలెక్టర్‌కు, మండల కేంద్రాల్లో తహసీల్దార్‌కు వినితి పత్రం సమర్పించవలసిందిగా మే 5వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో ఒక రోజు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని జెఏసీ కమీటి ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుందని అన్నారు.

ఈ నిరసన కార్యక్రమంలో పెన్షనర్స్, కార్మిక కాంట్రక్ట్ అవుట్సోర్సింగ్,ఉద్యోగులందరూ పాల్గోనాలని వికారాబాద్ జిల్లా జెఏసీ కొరుతున్నామన్నారు.

## జాతీయ కమిటీలో స్థానం కల్పించడం హర్షదాయకం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** తెలుగుదేశం పార్టీ జాతీయ కమిటీలో తెలంగాణ టిడిపి నేతలకు జాతీయ టిడిపి పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు బుధవారం ప్రకటించిన కమిటీలో పోలిట్‌బ్యూరో సభ్యులుగా బక్కని నర్సింహులు, ఎం అరవింద్‌కుమార్‌గౌడ్ అవకాశం కల్పించారు. జాతీయ పార్టీ అధికార ప్రతినిధులుగా నన్నూరి నర్సిరెడ్డి, తిరుణగరి జోత్స్నలు నియమించడం వల్ల జిల్లా సీనియర్ నాయకులు, చర్లపల్లి కాంటెస్టెంట్ కార్పొరేటర్ రుద్రగోని రాంచందర్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

